సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 4 : ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రైవేటు నర్సింగ్ హోం గైనకాలజిస్టులతో సమావేశం నిర్వహించారు. సిజేరియన్ ప్రసవాలను తగ్గించాలని, ప్రతీ దవాఖాన వైద్యులు ఈ నెలలో సాధారణ ప్రసవాలు చేసేందుకు ప్రణాళికలు కూడా సిద్ధం చేశామని తెలిపారు. వందశాతం సీ సెక్షన్ ప్రసవాలు చేసిన దవాఖానలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి కాన్పులోనే సాధారణ ప్రసవాలు చేసేందుకు వైద్యులు ముందడుగు వేయాలని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యులు క్రుపాబాయి, అనిత, సుధాకర్ నాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు ఇదే కార్యాలయంలో జరిగిన మరో కార్యక్రమంలో ఐఈసీ పోస్టర్లను విడుదల చేశారు. ఎనీమియా ముక్త తెలంగాణ కార్యక్రమంలో భాగంగా 5 నుంచి 9 ఏళ్ల పిల్లలకు పరీక్షలు నిర్వహించేందుకు ఈ పోస్టర్లను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. త్వరలోనే ఈ పోస్టర్లను ఆరోగ్య ఉపకేంద్రాలకు పంపుతామని వెల్లడించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 4 : ప్రభుత్వ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రిజిస్టర్లు, రికార్డులు, దవాఖాన పరిసరాలు, భోజనశాల, వంటగది పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. ప్రజల పట్ల స్నేహపూర్వకంగా ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మెనూ ప్రకారం రోగులకు మధ్యాహ్నం భోజనం అందించాలని తెలిపారు. వైద్య చికిత్సలకు అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధులపై సమయపాలన పాటిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం దవాఖా ఆవరణలో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి క్యాంటీన్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

భీమారం, అక్టోబర్ 4 : భీమారం మండల కేంద్రంలోని జడ్పీ సెకండరీ పాఠశాల 2012-13 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం అ'పూర్వ' సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు.

ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

కౌటాల, అక్టోబర్ 4 : దేవీ నవరాత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కౌటాల ఎస్ఐ మధూకర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం శారద దేవి, దుర్గా దేవి మండపాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే కమిటీ సభ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

- గడువులోగా పూర్తిచేయాలి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- ఆసిఫాబాద్, దస్నాపూర్‌లో పైలట్ సర్వే పరిశీలన

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 4 : ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వే ప్రక్రియ వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు, దస్నాపూర్‌లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రతీ కుటుంబానికి సంబంధించిన సభ్యుల వివరాలు పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని, ఇంటి యజమానురాలిగా మహిళ పేరు నమోదు చేసిన తర్వాత కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలని సూచించారు. అనంతరం కుటుంబం గ్రూప్ ఫొటో తీసుకోవాలని, మృతిచెందిన వారు, శాశ్వతంగా వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించి, జాబితాలో లేనివారి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఉమ్మడి కుటుంబం వివాహం జరిగి వేరువేరుగా నివాసం ఉంటే వారి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. సర్వే త్వరగా పూర్తిచేయాలని, 9న వివరాలను పరిశీలించి, నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపర్చి, నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సర్వే బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భీం వర్ధంతి వేడుకల పోస్టర్ల విడుదల..

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 4 : జోడెఘాట్‌లో 17వ తేదీన కుమ్రం భీం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులతో భీం వర్ధంతి వేడుకల గోడ ప్రతులు, కరపత్రాలు, ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. జల్ జంగల్ జమీన్ నినాదంతో బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహావీరుడు కుమ్రం భీం అని కొనియాడారు. వర్ధంతి వేడుకల నిర్వహణలో భాగంగా అన్ని శాఖల సమన్వయంతో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు అసౌకర్యం కలుగకుండా సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము సందర్శన

అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ సందర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సాంకేతిక సమస్యలతో ఆగిపోయిన 1 బ్యాలెట్ యూనిట్, 10 వీవీ ప్యాట్‌లను మరమ్మతుల కోసం ఈసీఎల్ హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపారు. గోదాములో పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టి, బందోబస్తు కల్పిస్తున్నట్లు చెప్పారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మధూకర్, ఎన్నికల న్యాయం తహసీల్దార్లు శ్యామలాల్, ఊర్మిళ, రామ్ లాల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై సమావేశం..

కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, ఐకేపీ, కార్మిక, రవాణా, బ్యాంక్ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో జిల్లాలో వానకాలం పంట ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లాలో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 34 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరం మేరకు అదనపు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. తూకం యంత్రాలు, టార్పాలిన్ కవర్లు, గన్నీ సంచులు, హుక్ రిమూవర్, డిజిటల్ మైక్రోమీటర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వం సన్నరకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించినందున సన్నరకం వడ్లు, దొడ్డు రకం వడ్లు కొనుగోలు చేసేందుకు వేర్వేరుగా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబర్ 4 : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రోడ్డు భవనాలు, పోలీసు, ట్రాఫిక్, జాతీయ రహదారులు, రవాణా తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారులపై కొన్ని ప్రాంతాల్లో సరైన విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రమాదాలకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయం జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించి, లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని, మూలమలుపు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్ ప్రాంతాల్లో వీధి విక్రయదారులు, రోడ్లపై కూరగాయలు, ఇతర వ్యాపారాలు జరుపకుండా ప్రత్యేక స్థలాలు కేటాయించాలని తెలిపారు. రహదారులపైకి వచ్చే పశువులను అదుపులోకి తీసుకొని, సంబంధిత యజమానులకు జరిమానా విధించాలన్నారు. వరదల కారణంగాదెబ్బతిన్న రహదారులకు మరమ్మతులను పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంతోషంగా జరుపుకోవాలి

నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, అక్టోబర్ 4 : మహిళలు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు నిమజ్జన ప్రాంతాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిలో లభించే పూలను దేవుడిగా కొలిచే సాంప్రదాయక వేడుక బతుకమ్మ పండగా అని పేర్కొన్నారు. ఈ పండుగను మహిళలు ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని సూచించారు. అక్కడి నుంచి ఎస్పీఎం క్రీడా మైదానం, రావణ దహనం చేసే స్థలం త్రిశూల్ పహాడ్‌ను పరిశీలించారు. తగు ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఇతర సిబ్బంది ఉన్నారు.

వన్యప్రాణి వారోత్సవాలు

తాండూర్ : మాదారం త్రీ ఇంక్లైన్‌లో ర్యాలీ తీస్తున్న అధికారులు

నెన్నెలలో..

తాండూర్, అక్టోబర్ 4 : జాతీయ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామంలో శుక్రవారం అటవీశాఖ అధికారులు ర్యాలీ తీశారు. ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జే తిరుపతి మాట్లాడుతూ.. వన్యప్రాణుల ఆవాసాలను సంరక్షించి, జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని, అతిక్రమిస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో సువర్ణ, ఎఫ్‌బీవోలు భాస్కర్, గోపికృష్ణ, నాయకులు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెన్నెల, అక్టోబర్ 4 : వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని కుష్నపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి దయాకర్ అన్నారు. వన్యప్రాణ సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా నెన్నెలలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది బైక్ ర్యాలీ తీశారు. స్థానిక రేంజ్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. అటవీ జంతువులను వేటాడవద్దని, వాటిని సంరక్షిస్తేనే అడవులతో పాటు మానవాళికి మనుగడ ఉంటుందన్నారు. డిప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

కోటపల్లి, అక్టోబర్ 4 : గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిత్యం నిర్వహించి, శుభ్రంగా ఉంచాలని డీపీవో వెంకటేశ్వర్ రావ్ పేర్కొన్నారు. కోటపల్లి మండలం పారుపల్లి, లింగన్నపేట, ఎదుల్లబంధం, పుల్లగామ, రొయ్యలపల్లి గ్రామాల్లో ఎంపీవో ముల్కల్ల సత్యనారాయణ రెడ్డితో కలిసి పర్యటించారు. పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గోదారి తిరుపతి, కోట శ్యామల, సమ్మయ్య, రమేశ్, బొల్లం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

తాండూర్, అక్టోబర్ 4 : మండలంలోని పలు జీపీల పరిధిలో శుక్రవారం అభివృద్ధి పనులకు అధికారులు, నాయకులు భూమి పూజ చేశారు. నర్సాపూర్, బెజ్జాల, కిష్టంపేట గ్రామాల్లో ఎంపీపీఎస్ పాఠశాలలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.13.76 లక్షలతో ప్రహరీ పనులు ప్రారంభించారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కే కుమారస్వామి, నాయకులు సూరం రవీందర్‌రెడ్డి, గట్టు మురళీధర్‌రావు, సాలిగామ బానయ్య, కడారి రత్నాకర్‌రావు, పేరం శ్రీనివాస్, సూరం దామోదర్‌రెడ్డి, పుట్ట శ్రీను, షేక్ మోమిన్, గట్టయ్య, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కాసిపేట, అక్టోబర్ 4 : కాసిపేట మండలం ముత్యంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో సీనియర్ క్రికెటర్ పెంజర్ల లక్ష్మణ్ స్మారకార్థం శుక్రవారం క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. ముందుగా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. టోర్నీలో 10 జట్లు పాల్గొంటాయని తెలిపారు. మాజీ ఉప సర్పంచ్‌లు బోయిని తిరుపతి యాదవ్, కనుకుల రాకేశ్, లక్ష్మణ్ తండ్రి పెంజర్ల బాపు, సామల లక్ష్మణ్, ఆర్గనైజర్లు ఉమాకాంత్, వేల్పుల రాజు, ఇంతియాజ్, ఉష్కమల్ల గోపాల్, రాజేశం, సునీల్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

పెంచికల్‌పేట్, అక్టోబర్ 4 : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఐసీడీఎస్ సిర్పూర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి ప్రారంభించారు. పెంచికల్‌పేట్ సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, ఆడిపాడారు. విరమణ పొందిన చేడువాయి అంగన్‌వాడీ టీచర్ గౌరీబాయి, బొంబాయి గూడ ఆయా సుశీల, లోడ్పల్లి ఆయా లసుమమ్మను సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ సరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, ఆర్ఐ సురేశ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టు ఆత్మహత్య

వాంకిడి, అక్టోబర్ 4 : వాంకిడి మండలం ఖిరిడీ గ్రామానికి చెందిన ఓ దినపత్రిక జర్నలిస్టు వడ్లూరి సురేశ్ గురువారం రాత్రి మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. సురేశ్ కొన్నేళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన బైక్‌పై ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల రెఫెర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య వడ్లూరి వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వర్షాల కోసం పూజలు

బొంబాయిగూడలో నిస్సాన్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

పెంచికల్ పేట్, అక్టోబర్ 4 : మండల కేంద్రంలోని బొంబాయి గూడ గ్రామస్తులు వర్షం కోసం ప్రత్యేక పూజలు చేశారు. భీమన్న దేవర జెండాలతో ప్రధాన వీధుల గుండా డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగించారు. ఇంటింటా బిందెడు నీళ్లు పోస్తూ తమ ఆచారం కొనసాగించారు. ఇలా చేయడంతో వర్షాలు పడి పంట చల్లంగా సుభిక్షంగా ఉంటాయన్నది నమ్మకమని గ్రామస్తులు తెలిపారు. వర్షాలు రాక పత్తి, వరి ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. అనంతరం అడవిలో కొలువుదీరిన సిద్ధేశ్వర స్వామి వద్ద గుండాలలో స్నానాల చేసి, అక్కడి నుంచి తెచ్చిన నీళ్లు, మట్టి పంట పొలాల్లో చల్లుతారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

దండేపల్లి, అక్టోబర్ 4 : దండేపల్లి మండలం గూడెం వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్యకు సిద్ధమైన కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన నామసాని శ్రీకాంత్‌ను దండేపల్లి, లక్షెట్టిపేట బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడినట్లు ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆటో డ్రైవర్ నామసాని శ్రీకాంత్ బెల్లంపల్లిలోని తన బంధువుల ఇంటికి వెళ్లగా అక్కడ గొడవ జరిగింది. దీంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకునేందుకు గూడెం గోదావరికి వచ్చాడు. ఈ విషయాన్ని వీడియోకాల్ చేసి, కుటుంబ సభ్యులకు చెప్పారు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు డయల్ 100కు సమాచారం అందించారు. దీంతో దండేపల్లి, లక్షెట్టిపేట బ్లూకోల్ట్స్ పోలీసులు సకాలంలో స్పందించి, శ్రీకాంత్‌ను కాపాడారు. కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒకరి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్స్ పోలీసులు లక్ష్మయ్య, శేఖర్, హోంగార్డ్ బ్రహ్మం, రత్నాకర్‌రాజును లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్, ఎస్ఐలు సతీశ్, ఉదయ్‌కిరణ్ అభినందించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

రెబ్బెన, అక్టోబర్ 4 : ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, బాధ్యతగా భావించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. స్వచ్ఛతా పఖ్వాడ కార్యక్రమంలో భాగంగా గోలేటిటౌన్‌షిప్ కార్మికకాలనీలోని వారసంతలో శుక్రవారం చెత్తాచెదారం, వ్యర్థాలు తొలగించారు. కాలనీలు, గనులు, డిపార్టుమెంట్లు శుభ్రంగా ఉంచి స్వచ్ఛతలో ఏరియా మొదటిస్థానంలో నిలిచేలా కృషిచేయాలని సూచించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పీవో ఉమాకాంత్, ఏరియా ఇంజినీర్ భీంరావ్‌జాడే, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ ఎస్ఈ షేక్ మదీనా బాషా, గోలేటి సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్య, ఎన్విరాన్‌మెంట్ అధికారి రమేశ్, ఈఈ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జెన్కో ఆధ్వర్యంలో విద్యుత్ ప్లాంటు నిర్మించాలి

నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

మందమర్రి, అక్టోబర్ 4 : జెన్కో ఆధ్వర్యంలోనే రామగుండంలో థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మించాలని మంచిర్యాల ఏడీ ఈ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఊరు మందమర్రిలోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ ఉద్యోగులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లా రామగుండంలో కాలంచెల్లిన 55.5 మెగావాట్ల థర్మల్ ప్లాంట్‌ను ప్రభుత్వం డిస్మెంటల్ చేసి, దాని స్థానంలో మరో 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ ప్లాంట్ నిర్మాణం బాధ్యతలు మొత్తం జెన్కో ఆధ్వర్యంలో జరుగాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందులో సింగరేణి, ప్రభుత్వం కలిసి థర్మల్ ప్లాంట్ నిర్మించాలని చూస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆ ఆలోచనను విరమించుకోవాలని, జెన్కోకు పూర్తిస్థాయి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్‌స్టేషన్ ఏఈ వేముల మౌనిక, ఎల్ ఐ రాజేంద్రప్రసాద్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన భూ నిర్వాసితులు

మంచిర్యాల (ఏసీసీ), అక్టోబర్ 4 : ఎన్‌హెచ్ 63 విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న ఎల్లంపెల్లి నిర్వాసితులు శుక్రవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిశారు. ఇప్పటికే ఎల్లంపెల్లిలో భూములు కోల్పోయి నిర్వాసితులుగా మారామని, ఆ ప్రాజెక్టు ముంపులో భాగంగా లభించిన భూములు, మళ్లీ జాతీయ రహదారి విస్తరణలో కోల్పోతున్నామని, దీనిపై న్యాయం జరిగేలా చూడాలని వినతి పత్రం అందించారు. బాధిత రైతుల సమస్యలు విన్న బండి సంజయ్.. విషయాన్ని కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వీరబెల్లి, బింగి ప్రవీణ్, బాధిత రైతు కొట్టే సత్యం పాల్గొన్నారు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

రెబ్బెన, అక్టోబర్ 4 : అటవీశాఖ నర్సరీలోని కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం సీనియర్ అసిస్టెంట్ రాజేందర్‌కు నర్సరీ కార్మికులు వినతిపత్రం అందించారు. దశరథం, బాపురావు, మారుతి, సంతోష్, కౌసల్య, సంఘమిత్ర, సరిత, స్వరూప, శంకరమ్మ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

కాసిపేట, అక్టోబర్ 4 : లంబాడీతండా(కే)లో బేస్ ఫ్యామిలీ డేటా సర్వే కొనసాగుతున్నది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామంలో సర్వేను ఆర్డీవో హరికృష్ణ పరిశీలించారు. 179 ఇండ్లను పూర్తి చేసినట్లు వివరించారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సర్దార్ అలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, కార్యదర్శులు విద్యాసాగర్, నరేశ్, కీర్తి, కంప్యూటర్ ఆపరేటర్లు రాజేందర్, శ్రీలత పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

నస్పూర్, అక్టోబర్ 4 : మంచిర్యాలలోని కార్మెల్ పాఠశాలలో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతున్నట్లు మంచిర్యాల డీఈవో యాదయ్య తెలిపారు. 715 మంది అభ్యర్థులకు గాను ఇప్పటి వరకు 595 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. శనివారం చివరి రోజు అని, మిగిలిన 120 మంది హాజరవ్వాలని సూచించారు.

మొదలైన ఓపెన్ స్కూల్ పరీక్షలు..

నస్పూర్, అక్టోబర్ 4 : జిల్లాలో టాస్ ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని డీఈవో తెలిపారు. పదో తరగతిలో మొత్తం 67 మందికి గాను 37 మంది.., ఇంటర్‌లో 114 మందికి 84 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి, అక్టోబర్ 4 : ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 ఫుట్ బాల్ పోటీలకు స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల పదోతరగతి విద్యార్థి కే భీమ్‌రావ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డూట శ్రీధర్ తెలిపారు. గత నెల 30న మంచిర్యాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రతిభ చూపాడని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. అక్కడ కూడా రాణించి పాఠశాలకు పేరుతేవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపాల్ ఏ విజయ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి చెఱుకు ఫణిరాజు, పీఈటీ అల్లూరి వామన్, ఉపాధ్యాయులు విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

కూలిన వృక్షం.. ఇంటిపై రేకుల ధ్వంసం

బెల్లంపల్లి, అక్టోబర్ 4 :